క్లుప్తంగా

నేడు చర్చిపేటలో జగనన్న సురక్ష

నిడదవోలు: పట్టణంలోని చర్చిపేట సచివాలయంలో 07, 08 వార్డులకు సంబంధించి సోమవారం ఉదయం 9 గంటలకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు.

'పశ్చిమ' ప్రధాన కాలువకు 4,700 క్యూసెక్కులు

నిడదవోలు: ఖరీఫ్ వ్యవసాయ అవసరాల కోసం ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు ఆదివారం 4,700 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇప్పటికే రైతులు నారుమడులు, దమ్ముల పనుల్లో నిమగ్నమయ్యారు. సాగునీటి అవసరాల మేరకు జలవనరుల శాఖాధికారులు ఎప్పటికప్పుడు నీటి విడుదలను క్రమంగా పెంచుతున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని నరసాపురం కాలువకు 1534, ఏలూరు కాలువకు 930, తణుకు కాలువకు 634,ఉండి కాలువకు 787, అత్తిలి కాలువకు 466 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మానవత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణం

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ గోపాలపురం మండల శాఖ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గోపాలపురంలోని కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులతో మానవత సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు బలుసు సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ముప్పన కృష్ణారావు, కార్యదర్శిగా ముప్పిడి అందిప్‌రెడ్డి, కోశాధికారిగా గడా జోగేందర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పప్పు సత్యకృష్ణారెడ్డి, సహాయకార్యదర్శిగా ఆకుల నవీన్‌రాజు, సభ్యులుగా కుక్కల కీర్తికుమార్, రాపాక ఫణికిషోర్, జుత్తిగ వెంకట్రావు, కాకర్ల హరే రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన అధ్యక్షుడిగా అప్పారావు

నల్లజర్ల: మానవత సంస్థ మండలశాఖ నూతన అధ్యక్షుడిగా రిటైర్డు ఎంఈఓ ఐడీవీ అప్పారావు ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గంతో ఆదివారం రాత్రి ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు నల్లజర్లలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా రుద్రపాక ఝాన్సీరాణి, కార్యదర్శిగా ఉప్పాడ కామేశ్వరరావు, కోశాధికారిగా గుండు త్రినాథరావు, సహాయ కార్యదర్శిగా తలంశెట్టి మాధవరావు, ఈసీ అవేర్‌నెస్‌గా అచ్యుత మధు, ఈసీ ఎడ్యుకేషన్‌గా ఎస్.రాజేంద్రప్రసాద్, ఈసీ హెల్త్‌గా బోడిగడ్ల సీతారాముడు, ఈసీ ఎమర్జెన్సీగా దొండపాటి దుర్గారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కండెపు వెంకట సూర్యనారాయణ, భోగవల్లి వెంకట సుబ్బారావు, సాగిరాజు జానకి రామరాజు, బలుసు సత్యనారాయణ, దావులూరి చిరంజీవి, దావులూరి ప్రభాకరరావు, పల్లి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం

మండలంలోని 9 జెడ్పీ హైస్కూళ్లలో ఈఏడాది 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను, వారితల్లిదండ్రులను నగదు బహుమతులు ,ప్రశంసాపత్రాలతో సత్కరించారు.ఐఐటీ వారణాశికి ఎంపికైన పెండ్యాల ఆశ్లేష్ తల్లిదండ్రులను, ఐఐటీ ముంబయికి ఎంపికైన కె.వివేకవర్ధన్ తల్లిదండ్రులను కూడా సత్కరించారు.

బీజేపీ మండల శాఖ అధ్యక్షుడి మృతి


కృష్ణప్రసాద్

చాగల్లు: బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కరుటూరి కృష్ణప్రసాద్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు అస్పత్రిలో చికిత్స పొందారు. ఆదివారం గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా పార్టీకి ఎనలేని సేవలు అందించారంటూ, ఆయన మృతికి పలువురు ఆ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన స్వగ్రామమైన బ్రాహ్మణగూడెంలో మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

కూలడానికి సిద్ధంగా వాటర్ ట్యాంక్


శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకు

దేవరపల్లి: త్యాజంపూడి మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉంది. సుమారు 40 ఏళ్ల క్రితం దీనిని నిర్మించారు. మొదట్లో గ్రామం అంతటికీ ఈ ట్యాంకు ద్వారానే మంచినీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం మూడు ట్యాంకుల ద్వారా సుమారు 1.60 లక్షల లీటర్ల మంచినీటిని త్యాజంపూడి ప్రజలకు పంచాయతీ సరఫరా చేస్తోంది. గ్రామ జనాభా దాదాపు 15 వేలకు చేరడంతో వేసవిలో మంచినీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ ట్యాంకును తొలగించి ప్రమాదాన్ని నివారించాలని వారు అధికారులను కోరుతున్నారు.

నాణ్యమైన విద్య.. అభివృద్ధికి బాట

- విద్యారంగంలో వినూత్న మార్పులు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారీ స్కూళ్లు
- సంక్షేమ పథకాలతో తల్లిదండ్రులకు తగ్గిన భారం


'నాడు-నేడు' పథకంలో అభివృద్ధి చేసిన కానూరు ఉన్నత పాఠశాల


'నాడు నేడు' పథకంలో అభివృద్ధి చేసిన అజ్జరం ప్రాథమిక పాఠశాల

పెరవలి: పేదరికాన్ని జయించే ఏకైక ఆయుధం విద్య అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విశ్వాసం. అందుకే ఆయన అధికారం చేపట్టగానే సంపన్నులకే కాదు రాష్ట్రంలోని పేదలందరికీ అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని సంకల్పించారు. ప్రభుత్వ విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడమే గాకుండా అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుకలు వంటి పథకాలు ప్రవేశపెట్టారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరిగి అవి ప్రస్తుతం విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడి పరీక్షల్లో ఫలితాలు సాధిస్తున్నాయి. తెలుగుదేశం హయాంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉండేది. కూలిపోతున్న భవనాలు, కొరవడిన వసతులు, దుర్గంధభరితంగా మరుగుదొడ్లు దర్శనమిచ్చేవి. ఆడుకునే మైదానాలు పిచ్చి మొక్కలతో దర్శనిమిచ్చేవి. దానికితోడు అంతంతమాత్రపు బోధన. దాంతో ఆర్థిక స్థోమత సహకరించకపోయినా పేద, దిగువ మధ్య తరగతి వర్గాలు కూడా అప్పులు చేసి తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదవించే వారు.

రూ.51.60 కోట్లతో ఆధునీకరణ

పెరవలి మండలంలో గత నాలుగేళ్ళుగా విద్యారంగాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.51.60 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ముఖ్యంగా పాఠశాల భవనాల అభివృద్ధికే రూ.8 కోట్లు వెచ్చించింది. మిగిలిన సొమ్ములను అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, ట్యాబ్స్, గ్లాసులు, స్మార్ట్ టీవీల వంటి వాటికి ఖర్చు చేశారు.

నాలుగేళ్లుగా వివిధ పథకాల ద్వారా మండలంలో విద్యారంగానికి ఖర్చు

పథకం పేరు	స్కూళ్లు, విద్యార్థుల సంఖ్య	ఖర్చు
1. నాడు -నేడు	40	రూ. 8 కోట్లు
2. అమ్మ ఒడి	25597 మంది	రూ.36.45 కోట్లు
3. జగనన్న విద్యాకానుక	18246 మందికి	రూ.2.88 కోట్లు
4. జగనన్న గోరుముద్ద	19007 మందికి	రూ.1.72 కోట్లు
5.ట్యాబ్‌లు	619 మందికి	రూ. 89.75 లక్షలు
6. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ	42	రూ. 50.82 లక్షలు
7. గ్లాస్‌లు	4219	రూ. 1.85 లక్షలు
	మొత్తం	రూ.51.60 కోట్లు

పెరిగిన విద్యార్థుల సంఖ్య

మండలంలోని 49 ప్రాథమికి పాఠశాలల్లో గతంలో 1329 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. విద్యార్థులు లేరనే నెపంతో అధికారులు వాటిలో 8 పాఠశాలలను మూసి వేశారు. అప్పుడు ఏడు ఉన్నత పాఠశాలల్లో 2171 మంది విద్యార్థులు చదువుకొనేవారు. ఇప్పుడు 41 ప్రాథమిక పాఠశాలల్లో 1701 మంది, ఏడు ఉన్నత పాఠశాలల్లో 2518 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మండలంలోని పాఠశాలల్లో 719 మంది విద్యార్థులు పెరిగారు.

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశాం. వసతులు మెరుగుపడ్డాయి. ఫలితంగా ఇక్కడ చదివే విద్యార్థుల సంఖ్యం పెరిగింది. గతంలో ఇటువంటి సదుపాయాలు లేవు. విద్యార్థుల సంఖ్యా అంతంతమాత్రంగా ఉండేది. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.

– టీబీఎస్ స్వరూప్, ఎంఈఓ, పెరవలి

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం


నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయంగా రోటరీ సేవాసంస్థ నిర్వహిస్తున్న వివిధ సేవలు అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్‌లో యువతను ప్రోత్సహిస్తూ వారికి సేవా నిరతిని అలవరచాలన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కీర్తి ఆంజనేయులు, కార్యదర్శిగా గుంటుపల్లి వెంకట నాగశివకుమార్, కోశాధికారిగా కాళ్ళ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా మీసాల శివరామ హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా గరగ సాయి శ్రీనివాస్‌లతో పాటు కార్యవర్గ సభ్యులతో ఇన్‌స్టలేషన్ అధికారి డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు పదవీ ప్రమాణం చేయించారు. పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదగా సిల్వర్ మెడల్స్ బహూకరించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, ఎండీ ఫయాజ్, కేదారిశెట్టి రవికుమార్, కారింకి సాయిబాబు, గాజుల రంగారావు, అయినీడి పల్లారావు, కామిశెట్టి సత్యనారాయణ, జయవరపు ఆదికోటేశ్వరరావు, కొర్లేపర వెంకట రత్నకుమార్ పాల్గొన్నారు.

సహకార సేవలు ఇతర రంగాలకు విస్తరణ


త్యాజంపూడిలో పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జీవీ

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- త్యాజంపూడి సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన పెట్రోల్ బంక్ ప్రారంభం

దేవరపల్లి: సొసైటీలు కేవలం రైతు సేవలకే పరిమితం కాకుండా ఇతర రంగాలకు కూడా విస్తరించడం సంతోషకరమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని త్యాజంపూడి సొసైటీ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ఆదివారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఆయన వినియోగదారులకు పెట్రోల్ కొట్టారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉండగా, దాదాపు అన్ని సొసైటీలూ పెట్రోలు బంకులు ఏర్పాటు చేసి వినియోగదారులకు నాణ్యమైన ఇంధనాన్ని సరఫరా చేస్తున్నాయన్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సొసైటీల ధాన్యం కొనుగోళ్ల ద్వారా ఒక్కో సొసైటీకి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల ఆదాయం వస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం వల్ల సొసైటీలు లాభాల్లో నడుస్తున్నాయన్నారు.చిన్నాయగూడెం సొసైటీ పరిధిలో రెండు, యర్నగూడెం, దుద్దుకూరు సొసైటీల ఆధ్వర్యంలో ఒక్కొక్క బంకులను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే చెప్పారు. సొసైటీ బంకుల్లో కల్తీలేని ఆయిల్ ఉంటుందని వినియోగదారుల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. ఈ బంకు చుట్టుపక్కల సుమారు 10 గ్రామాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, సొసైటీ అధ్యక్షుడు కాకర్ల శోభన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నియోకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్ర బాబు, మండల రైతు విభాగం అధ్యక్షుడు పల్లి వెంకటరత్నారెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రమాప్రభ పాల్గొన్నారు.

పరామర్శ

విశాఖలో ఇటీవల కిడ్నాప్‌నకు గురై సురక్షితంగా బయపడి తొలిసారిగా సొంతూరు దేవరపల్లి మండలం పల్లంట్లలోని స్వగృహానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ గోపాలపురం నియోకవర్గం పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ)ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండలాల అధ్యక్షులు పరామర్శించారు.

అసాంఘిక కార్యాకలాపాలపై విస్తృత తనిఖీలు


వాడపల్లి స్నానఘట్టం వద్ద తాగుతున్న యువకులకు డీఎస్పీ వర్మ కౌన్సెలింగ్


కొవ్వూరు మండలం వాడపల్లిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

- పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్
- బహిరంగ ప్రదేశాల్లో తాగుతున్న 16 మందిపై కేసు

కొవ్వూరు: అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆదివారం రాత్రి గోదావరి నదీ తీరంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్సై పి.రవీంద్రబాబులతో పాటు పట్టణ, రూరల్ స్టేషన్ సిబ్బందిని వెంట బెట్టుకుని ఆరికిరేవుల, కొవ్వూరు, వాడపల్లి, సీతంపేట, మద్దూరులంక గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆరికిరేవుల ఇసుక ర్యాంపులో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట శివారున పంపు హౌస్ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి , రెండు కోళ్లు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 16 మందిపై కేసు నమోదు చేశారు. ఇటీవల వాడపల్లి గ్రామంలో రాత్రి పూట కొందరు మద్యం సేవించి కొట్లాడుకున్నారు. ఈ వివాదంతో గ్రామంలోని రెండు వర్గాల మధ్య చిచ్చు రేగింది. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు డీఎస్పీ వర్మ ప్రకటించారు. గంజాయి అమ్మకాలు, తాగుడుపై నిఘా ఉంచామన్నారు. రాత్రిపూట రాజమహేంద్రవరం, ధవళేశ్వరం ప్రాంతాల నుంచి కొందరు గంజాయి తీసుకొచ్చి కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. ఈ మేరకు ఈ తనిఖీ చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా గంజాయి తాగుతున్న ముఠాపై దాడులు నిర్వహించామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. హెడ్ కానిస్టేబుల్స్ ఆర్.సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

వారందరూ కలిసె.. చదువులమ్మ మురిసె


సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి సంఘం గౌరవాధ్యక్షుడు కైగాల సుబ్బారావు


అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- అట్టహాసంగా వేగేశ్వరపురం హైస్కూల్ వజ్రోత్సవం
- నాటి మధురస్మృతులను నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు
- ప్రముఖులకు, పూర్వ విద్యార్థులకు సన్మానం

తాళ్లపూడి: చదువులమ్మ మురిసిపోయింది. తన ఒడిలో అక్షరాలు దిద్దిన బాలలందరూ ఎన్నో ఏళ్ల తర్వాత తన చెంతకు చేరి ఒకే కుటుంబంలా వేడుక నిర్వహించడం ఆమెకు మధురానుభూతిని కలిగించింది. వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ శుభ దినాన పూర్వ విద్యార్థులు నాటి తమ మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని పులకరించారు. ఈ ఉన్నత పాఠశాల 75 ఏళ్ల వేడుక, జూనియర్ కళాశాల 45వ వార్షికోత్సవాన్ని ఆదివారం నభూతో నభవిష్యతి అనే రీతిలో ఆదే విద్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుక సాగింది. ఈ వజ్రోత్సవం 1946 నుంచి 2023 వరకూ ఈ పాఠశాలలో చదివిన వారందరూ కలిసే వేదిక అయ్యింది. ఉదయం నుంచి రాత్రి వరకూ పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి సంఘం గౌరవాధ్యక్షుడు, ఐఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కైగాల వెంకట సుబ్బారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల ఇష్టాగోష్ఠితో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల సావనీర్, కై గాల సూర్యచంద్రరావు జీవిత చరిత్ర పుస్తకం, చరితం చరితం వేగేశ్వరపురం చరితం గేయాన్ని ఆవిష్కరించారు.

ప్రతిభావంతులుగా ఎదగాలి

కైగాల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల చదువులకు చేయూత ఇస్తామన్నారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ అందరిని కలిపే పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థి సంఘం కృషి అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులను కలిపే ఇటువంటి మహత్తర కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు, దివంగత కైగాల సూర్యచంద్రరావు కృషిని అభినందించారు. ఉపాధ్యాయులను, నాటి గురువులను, వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందజేశారు. వచ్చిన వారందిరికి భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలామణి, ప్రిన్సిపాల్ గౌరీనాథ్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరాటం రాంబాబు, మాజీ మంత్రి కేఎస్ జవహర్, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మారిన రామూర్తి, సర్పంచ్, పూర్వ విద్యార్థి కొమ్మిరెడ్డి పరశురామారావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, మాజీ వీసీ పి. జార్జివిక్టర్, సీఐ బాబీ, డాక్టర్ పంకజాక్సన్, గ్రామపెద్దలు పూర్వ విద్యార్థులు కైగాల రాంబాబు, కైగాల శ్రీనివాసరావు, శీర్ల సత్యనారాయణ, వీరమల్లు సూర్యనారాయణ, శీర్ల బ్రహ్మానందం, ఎం భాస్కరరావు, పరస రాధాకృష్ణ, దాయన చంద్రాజీ, జీటీపీ ప్రసాద్, నామన పరమేశ్వరరావు, పరస రవి, బొరుసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది



కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవానికి 1946 నుంచి చదివిన వారందరూ హాజరైనందుకు ఆనందంగా ఉంది. విద్య అందరికీ విద్యా అందాలన్న ఉద్దేశంతో నాడు మా తండ్రి కైగాల సూర్యచంద్రరావు పాఠశాల ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు, దాతలు, గ్రామస్తుల తోడ్పాటుతో పాఠశాలకు పాత వాటి స్థానంలో అత్యాధునిక భవనాలు నిర్మించాం. తరగతి గదులకు ప్రముఖుల పేర్లు పెట్టాం. పాఠశాల అభివృద్ధికి అండగా ఉంటాం.

– కైగాల సుబ్బారావు, ఐఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్, వేగేశ్వరపురం

తొలి విద్యార్థిని కావడం అదృష్టం



కేఎస్ఆర్ పీహెచ్ స్కూలు ఆగస్టు 15, 1946న ప్రారంభమైంది. అదే రోజున ఆరో తరగతిలో చేరాను. నాదే తొలి అడ్మిషన్. గోపాలపురం మండలం చిట్యాల నుంచి నడుచుకుంటూ వచ్చేవాడిని. వజ్రోత్సవానికి నన్ను ఆహ్వానించడం సంతోషంగా ఉంది.

– పునులూరి సత్యనారాయణ, పాఠశాల తొలి విద్యార్థి, చిట్యాల

నా ఎదుగుదల వెనుక ఈ పాఠశాల



ఈ హైస్కూల్లో 1883లో టెన్త్, ఇదే జూనియర్ కళాశాల్లో 1985లో ఇంటర్ పూర్తి చేయడం నా జీవితంలో మరచిపోలేను. కేవలం గోటితో చిత్రాలు గీస్తూ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందాను. నఖ చిత్ర కళానిధి, కణ చిత్ర కళాతపస్వి సహా 14 బిరుదులు, 294 అవార్డులు, అనేక సన్మానాలు పొందాను. నేడు నేను ఈ స్థానంలో ఉండడానికి నాకు పాఠశాల నేర్పిన చదువే కారణం.

– డాక్టర్ రవి పరస, అంతర్జాతీయ నఖ చిత్రకారుడు, హ్యాండ్ రైటింగ్ స్కిల్ ట్రైనర్, చిడిపి

మా కుటుంబం నుంచి 60 మందికి పైగా..



మా కుటుంబం నుంచి అమ్మ సీతామహాలక్ష్మి 1955 -1960లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశారు. మా కుటుంబం నుంచి 60 మందికి పైగా ఈ పాఠశాలలో చదివారు. నేను 1983-1984లో ఎస్ఎస్‌సీ, 1987లో ఇంటర్ ఇక్కడ చదవడం ఇప్పటికీ మధురానుభూతి.

– సింగంశెట్టి వీవీ సత్యనారాయణమూర్తి,(బాబి) సీఐ , తాడేపల్లిగూడెం

ఆనందలహరి.. విద్యార్థుల సందడి

- నిడదవోలులో సండే స్కూల్
- పలు అంశాల్లో విద్యార్థులకు శిక్షణ


చిన్నారులకు సంగీత పాఠాలు నేర్పిస్తున్న టీచర్

నిడదవోలు: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు ఆదివారం శ్రీకృష్ణ ఆనందలహరి పేరిట సండే స్కూల్ నిర్వహించారు. హిందూ సమాజ్ వేదిక ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఇందులో భాగంగా ఐదు నుంచి 15 ఏళ్ల పిల్లలకు సంగీతం, యోగా, సూర్య నమస్కారాలు, ఆటలు, పాటలు, నీతికథలు, కోలాటంలో శిక్షణ ఇచ్చారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆలయం వద్ద సందడి చేశారు. పాఠశాల సెలవు దినాల్లో సెల్‌ఫోన్లతో సమయాన్ని వృథా చేస్తున్న చిన్నారులకు ఇటువంటి శిక్షణ శిబిరాలు నిర్వహించడం ఆనందదాయకమని తల్లిదండ్రులు చెబుతున్నారు. కార్యక్రమంలో బండి సూర్యనారాయణ, గూడూరి వెంకటరమణ, కృష్ణామాచార్యులు, సౌజన్య, సానేపు సుబ్బారావు, అందే కోటేశ్వరరావు, కుసుమ ప్రియ, కె.రాణి, కె.మయూరి, బి.సూర్యకుమారి, గంటా గిరిధర సుబ్బారావు, కాకి శివకిషోర్ తదితరులు పాల్గొన్నారు.